# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా విస్తృత స్పందన లభిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్‌లో హర్షం వ్యక్తంచేశారు.

2. స్థానిక చేనేత ఉత్పత్తులను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి సామాజిక మాధ్యమాలను వినియోగించుకోవాలని ప్రధానమంత్రి సూచించారు.

3. ఆంధ్రప్రదేశ్‌లోని చెంచు గిరిజన తెగ పులుల సంరక్షణపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్‌లో ప్రస్తావించారు.

4. రాష్ట్రంలోని యువత కోసం నైపుణ్యాల అభివృద్ధి కేంద్రాల్ని ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

5. గుంటూరు-బీబీనగర్ రెండో రైల్వే లైన్ నిర్మాణానికి రైల్వేశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

6. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.

==========================

విశ్వ క్రీడల ఒలింపిక్స్ క్రీడాకారులకు ప్రపంచ వేదికపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే అవకాశం అందిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. ప్రధానమంత్రి తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమం 112వ సంచిక ఈరోజు ఉదయం 11 గంటలకు ఆకాశవాణి ద్వారా ప్రసారమైంది. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి వివిధ అంశాలపై ప్రజలతో సంభాషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గణిత ప్రపంచంలో ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్ జరిగిందని, భారతీయ విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబరిచారని తెలిపారు. ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా విస్తృత స్పందన లభిస్తోందని హర్షం వ్యక్తంచేశారు. ఇండోర్‌లో తల్లిపేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా ఒకే రోజు 2 లక్షలకు పైగా మొక్కలు నాటారనన్నారు. అమ్మ కోసం, మాతృభూమి కోసం ప్రతి ఒక్కరూ మొక్కను నాటడం కొనసాగించాలని తెలిపారు.

--------------------------

చేనేత ఉత్పత్తులకు దేశంలో ప్రత్యేక స్థానం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ రోజు జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ, ఆగస్టు 7వ తేదీన 'జాతీయ చేనేత దినోత్సవం'

జరుపుకుంటున్నామన్నారు. స్థానిక చేనేత ఉత్పత్తులను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి చాలా సామాజిక మాధ్యమాలలో హ్యాష్‌ట్యాగ్ మై ప్రోడక్ట్ మై ప్రైడ్ పేరుతో కూడా అప్‌లోడ్ చేయవచ్చని పేర్కొంటూ,

వాయిస్ ( 40 సెకన్లు )

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని చెంచు గిరిజనులు పులుల సంరక్షణకు కృషి చేస్తున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోది పేర్కొన్నారు. ఈ రోజు జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నల్లమల కొండలపై నివసించే చెంచుల గురించి ప్రస్తావించారు. పులుల సంరక్షణకు చెంచు గిరిజనులు టైగర్ ట్రాకర్లుగా, అడవిలో వన్యప్రాణుల సంచారం గురించి ప్రతి సమాచారాన్ని సేకరిస్తారని తెలిపారు. దీంతో పాటు ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమాలపై నిఘా పెట్టి అధికారులకు సమాచారం అందిస్తూ అటవీ సంరక్షణకు తోడ్పాటును అందిస్తున్నారని ప్రశంసించారు. ఇలావుండగా ప్రధానమంత్రి తమ కృషిని గుర్తించి ప్రస్తావించడం ఆనందంగా ఉందని నంద్యాల జిల్లా నల్లమల అటవి ప్రాంతాల్లో నివసించే చెంచు గిరిజనులు ఆకాశవాణికి తెలుపుతూ...

వాయిస్ ( 27 సెకన్లు)

-------------------------

హర్ ఘర్ తిరంగా అభియాన్ త్రివర్ణ పతాక చరిత్రలో ఒక అపూర్వమైన పర్వదినంగా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఈ రోజు జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి హర్ ఘర్ తిరంగా కార్యక్రమం గురించి ప్రస్తావించారు. దేశంలో ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా జాతీయ పతాకం పట్ల ఉన్న గౌరవం అందరినీ చేరువచేస్తుందని చెప్పారు. ఈ ఏడాది కూడా త్రివర్ణ పతాకంతో కూడిన సెల్ఫీని హర్ ఘర్ తిరంగా డాట్ కామ్‌లో అప్‌లోడ్ చేయాలని వివరిస్తూ,

వాయిస్ ( 35 సెకన్లు )

-------------------------

ఏ దేశమైనా వారి సంస్కృతిని గౌరవించడం ద్వారా మాత్రమే అభివృద్ధి చెందుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ఈ రోజు జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ, ప్రజా కళను ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు, వర్ధమాన కళాకారులను ఒకే వేదికపైకి తీసుకురావడానికి ప్రాజెక్ట్ పరీ పబ్లిక్ ఆర్ట్ ఆఫ్ ఇండియా ఒక ప్రధాన మాధ్యమంగా దోహదపడుతుందన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా బహిరంగ ప్రదేశాలలో దేశ సంస్కృతిని చిత్రీకరించడం ద్వారా భారతీయ సాంప్రదయాలకు మరింత ప్రాచుర్యం కల్పించవచ్చని ప్రధానమంత్రి తెలుపుతూ,

వాయిస్ ( 40 సెకన్లు )

-------------------------

రాష్ట్రంలో యువత ఉపాధికి కావాల్సిన శిక్షణను అందించేందుకు నైపుణ్యాల అభివృద్ధి కేంద్రాల్ని ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. విజయనగరం జిల్లా గజపతినగరంలో ఆయన నిన్న మాట్లాడుతూ, చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల స్థాపనలో... యువత,

ఔత్సాహికులకు అందుబాటులో ఉండేలా ఆంధ్రప్రదేశ్ లో కొత్త విధానాన్ని అమలు చేయనున్నామని తెలిపారు. అమరావతిలో 200 కోట్ల రూపాయలతో సాంకేతిక కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. పది జిల్లా కేంద్రాల్లో 200 కోట్లతో గ్రోత్‌సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి వివరించారు.

-------------------------

గుంటూరు–బీబీనగర్ మార్గంలో రెండో రైల్వే లైన్ నిర్మాణం కోసం గుంటూరు జిల్లా పరిధిలో భూసేకరణకు రైల్వేశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 239 కిలోమీటర్ల మేర నిర్మించే ఈ లైన్‌లో భాగంగా గుంటూరు జిల్లాలోని మేడికొండూరు మండలంలోని మూడు గ్రామాలు, గుంటూరు పశ్చిమ మండలంలోని చినపలకూరు, నల్లపాడు గ్రామాలు, తాడికొండ మండలంలోని బండారుపల్లి గ్రామాల్లో కలిపి మొత్తం 47.785 ఎకరాలు సేకరించనున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపింది. వీటిపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారికి లిఖితపూర్వకంగా 30 రోజుల్లో అందజేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

-------------------------

ప్రకృతిని కాపాడితే అది మనల్ని రక్షిస్తుంది. భూమి, నీరు, గాలి, సహజ వనరులు, మొక్కలు, వన్యప్రాణులు, పర్యావరణాన్ని భవిష్యత్తు తరాల కోసం కాపాడుకోవాలి. వీటి ఆవశ్యకతను తెలియజేసేందుకు పతి ఏటా జులై 28న ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రజలను ఏకం చేసి మొక్కలను రక్షించుకోవటం, వన్యప్రాణుల రక్షణకు డిజిటల్ ఆవిష్కరణల వినియోగం అనే ఇతివృత్తంతో ఈ ఏడాది ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అడవుల పెంపకం, ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడం వంటి అంశాలపై ప్రపంచవ్యాప్తంగా పలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

-------------------------

మహిళలను వేధించే వారిపై కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పరిశీలించారు. నిన్న మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆయా సమస్యలను పరిశీలిస్తూ, సంబంధిత అధికారులు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కొందరు యువకులు విద్యార్థినులను, యువతులను వేధిస్తున్నారని తిరుపతి జిల్లా వెంకటగిరిలోని ఎన్టీఆర్‌కాలనీకి చెందిన మహిళలు ఉప ముఖ్యమంత్రి రాశారు. దీనిపై స్పందించిన పవన్‌కల్యాణ్ ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడిని ఆదేశించారు. యువతులను, మహిళలను వేధించేవారి పట్ల అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్– ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ రోజు నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు శాఖాపరమైన పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 16 జిల్లాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాట్లు చేసినట్టు సర్వీస్ కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 33 వేల 603 మంది ఉద్యోగులు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు రెండు పరీక్షలు నిర్వహిస్తామని, తొలి మూడు రోజులు ఆన్‌లైన్, తర్వాత మూడు రోజులు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో ఈ పరీక్షలు జరుగుతాయని ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష సమయానికి అరగంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలని, అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు.

=====================